క్లుప్తంగా

పాస్టర్ల సంఘం అధ్యక్షుడిగా స్వామిదాసు యాదవ్


స్వామిదాసు యాదవ్

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడం గ్రామానికి చెందిన స్వామిదాసు యాదవ్ పాస్టర్ల సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. బుధవారం మండల పాస్టర్లు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్వామిదాసు యాదవ్ మాట్లాడారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పాస్టర్ల సమస్యలపై శక్తివంచన లేకుండా పని చేస్తానని అన్నారు. కార్యక్రమంలో వాసుదేవ్, కిరణ్, డానియేల్, జోషి, సామేల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో బీజేపీ, బీఆర్ఎస్ నుంచి పలువురు నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సర్పంచ్ నెమురు గొమ్ముల శాతవాహనరావు, గ్రామ అధ్యక్షుడు ఎల్లంల నాగయ్య వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మహేందర్, వెంకటయ్య, సోమయ్య, రాములు, నరేష్, వెంకన్న, మధు, అయోధ్య, ఉప్పలయ్య, నర్సయ్య, వీరసోములు ఉన్నారు.

నిరుద్యోగుల నిరసన


పర్సాయపల్లిలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

అర్వపల్లి : నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైనందున ఈ ఎన్నికల్లో నిరుద్యోగ జేఏసీ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తుందని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ నోముల వంశీయాదవ్ అన్నారు. బుధవారం పర్సాయపల్లిలో నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిరుద్యోగ చైతన్యయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మర్రిపల్లి సురేష్, సోమశేఖర్, బింగి శ్రీకాంత్, కరుణాకర్, శేఖర్ రెడ్డి, వీరారెడ్డి, సురేష్, యాకూబ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన 2004–2005 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థి పేరెల్లి గోవర్ధన్ తండ్రి పేరెల్లి నందయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆ బ్యాచ్ విద్యార్థులు గోవర్ధన్‌కు బుధవారం రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. తమ తోటి స్నేహితులకు ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకుంటామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సూరారపు శ్రీను, ఎం.శ్రీను, కుంట్ల శ్రీను, బూర్గుల భాగ్యమ్మ, ఉషశ్రీ, సరిత, శైలజ, రాజేష్, సుధాకర్, లింగయ్య, రవి, బూర్గుల రాంబాబు, వై. వీరస్వామి, బి. నాగేంద్రబాబు, కె. నాగరాజు, డి. సందీప్, భాగ్యమ్మ, పి. సందీప్, కౌసర్‌బేగం, అలివేలు, విష్ణు, నాగరాజు, రమేష్, శ్రీను, ప్రవీణ్, నర్సయ్య, సతీష్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ మండలంలో 40 పోలింగ్ కేంద్రాలు


చీదెళ్లలో ఈవీఎంలను తీసుకెళ్తున్న సిబ్బంది

పెన్‌పహాడ్ : గురువారం జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. పెన్‌పహాడ్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని 40 పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో మొత్తం 33,297 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నట్లు సెక్టార్ అధికారి నకిరేకంటి రవి తెలిపారు.

అల్లర్లు జరగకుండా బందోబస్తు

నడిగూడెం : మండల వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఐ పి.ఏడుకొండలు బుధవారం విలేకరులకు తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర బలగాలతో పాటు, దాదాపు 100 మంది పోలీసు బందోబస్తు నడుమ ఎన్నికలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- తుంగతుర్తి నియోజకవర్గంలో 326 పోలింగ్ కేంద్రాలు
- సామగ్రితో ఇప్పటికే పోలింగ్ సెంటర్లకు చేరుకున్న సిబ్బంది
- అభ్యర్థుల భవిష్యత్తును నిర్ణయించనున్న 2,55,017 మంది ఓటర్లు


తుంగతుర్తిలో ఎన్నికల సామగ్రిని తీసుకొని పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

తిరుమలగిరి : తుంగతుర్తి నియోజకవర్గంలో పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలో 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మూడవసారి తుంగతుర్తి అసెంబ్లీకి జరుగనున్న ఎన్నికలు ఎంతో ఉత్కంఠకు గురి చేస్తున్నాయి. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ జరిగింది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్ రెండుసార్లు విజయం సాధించారు. మూడవసారి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య పోటీ నెలకొంది. బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ శాసన సభ్యుడు గాదరి కిషోర్‌కుమార్, కాంగ్రెస్ నుంచి మందుల సామేల్, బీజేపీ నుంచి కడియం రామచంద్రయ్యలు బరిలో ఉన్నారు.

భారీగా పోలింగ్ నమోదయ్యేలా..

తుంగతుర్తి నియోజకవర్గంలో 2,55,017 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1,27,578 మంది, మహిళలు 1,27,431 మంది, ఇతరులు 8 మంది ఉన్నారు. ఓటర్లు మొత్తం 326 పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గత రెండుసార్లు ఎన్నికల్లో నియోజకవర్గంలో భారీగా పోలింగ్ నమోదైంది. 2014లో 78.1, 2018లో 86.3 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కూడా భారీగా పోలింగ్ జరగడానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు గత పది రోజులుగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు ఫోన్‌లు చేసి రవాణా సౌకర్యం కల్పించి తీసుకొస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు 20 వేలకు పైగానే ఉన్నారు.

తిరుమలగిరిలో 40 పోలింగ్ బూత్‌లు..

గురువారం జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు తిరుమలగిరి మండలంలో 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు చేరుకున్నారు. గురువారం జరిగే ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

మద్దిరాల : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల పోలింగ్ కేంద్రాలకు బుధవారం ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. గురువారం జరిగే ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

నాగారంలో ఏర్పాట్లు పూర్తి

నాగారం : అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల నిర్వహణ అధికారులు పోలింగ్ సామగ్రితో బుధవారమే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నాగారం మండలంలో మొత్తం 23,691 ఓటర్లు ఉండగా, వీరిలో 11,807 పురుషులు, 11,881 మహిళలు, ముగ్గురు ఇతరులు ఉన్నారు. మండలంలో 29 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. 29 మంది పీఓలు, 29 మంది ఏపీఓలు, 58మంది ఓపీఓలు, 108మంది ఇతర పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నట్లు అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి యాదగిరిరెడ్డి తెలిపారు.

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు ఇలా..

మండలం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు
మోత్కూరు	31	26953
అడ్డగూడూరు	30	22631
శాలిగౌరారం	52	39386
జాజిరెడ్డిగూడెం	32	23826
నూతనకల్	35	28135
మద్దిరాల	31	24665
తుంగతుర్తి	46	33397
నాగారం	29	23691
తిరుమలగిరి	40	32333


పెన్‌పహాడ్ : అనంతారంలో పోలింగ్ స్టేషన్‌కు సామగ్రిని తీసుకొస్తున్న సిబ్బంది


మద్దిరాల : పోలుమల్ల గ్రామ పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది


నాగారం పోలింగ్ కేంద్రంలో అభ్యర్థుల జాబితాను గోడకు అంటిస్తున్న పోలింగ్ సిబ్బంది

పోలింగ్‌కు ఏర్పాట్ల పరిశీలన


తుంగతుర్తిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, తదితరులు

తుంగతుర్తి : గురువారం జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ వెంకట్రావ్ తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌లను పోలింగ్ సిబ్బందికి పంపిణీ చేసే కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల సిబ్బంది ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు, వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ చిట్టి లేదని ఎవరు కూడా అధైర్యపడొద్దని, ఎన్నికల సంఘం 12 రకాల గుర్తింపు కార్డులను గుర్తించిందని, గుర్తింపు కార్డుతో పాటు ఓటరు నంబర్ తీసుకెళ్తే ఓటు వేయవచ్చని అన్నారు. జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు 1,201 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు వృద్ధులకు, వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు కల్పించామన్నారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, ఎవరైనా ఎన్నికల నియమాలను ఉల్లంఘించినట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా ఈవీఎంలు మొరాయిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్తే వెంటనే సరిచేయిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం సెక్టోరియల్ ఆఫీసర్లను నియమించామని తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయనతో పాటు ఎస్పీ రాహుల్‌హెగ్డే, ఆర్వో వెంకట్‌రెడ్డి, ఏఆర్వో యాదగిరిరెడ్డి తదితరులు ఉన్నారు.

దాతల అన్నదానం

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం సుమారు 500 మంది మాలధారులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేపాల ప్రసాదరావు, చల్లా రామ్మూర్తి తెలిపారు. అన్నదానాన్ని కోదాడ పట్టణానికి చెందిన బాతం నారాయణ, యశోదమ్మ, వెంకటేశ్వరరావు, రాజేశ్వరి, వికాస్, శ్రీనివాసరావు, రమాదేవి, శ్రీహర్ష, ప్రత్యూషల దాతృత్వంతో నిర్వహించినట్లు తెలిపారు. అదే విధంగా పట్టణానికి చెందిన చిట్లా బత్తిని వెంకటరమణయ్య, సుధారాణి, శ్రీనివాస్, సుష్మ, ఆదిలక్ష్మి కూడా సహకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గురుస్వామి గురునాథం పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో సాయుధ పోలీసు బలగాలు


అర్వపల్లిలో పోలీసుల కవాతు

అర్వపల్లి : అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా జాజిరెడ్డిగూడెం మండలంలో ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల వ్యాప్తంగా 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తిమ్మాపురం, కొమ్మాల, కుంచమర్తిలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి ఆయా గ్రామాల్లో కేంద్ర సాయుధ పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు కాగా సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేకంగా పోలింగ్ బూత్‌ల నందు సీసీ కెమెరాలను బిగించారు. ఏపీ, తమిళనాడుకు చెందిన 60 మంది పోలీస్ సిబ్బందిని కేంద్రాల్లో బందోబస్తుకు నియమించారు. హైదరాబాద్‌కు చెందిన విజిలెన్స్ సీఐ వెంకన్న, ఎస్ఐ బి.అంజిరెడ్డిలు ఎన్నికలను పర్యవేక్షిస్తున్నారు. కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు.

కందికి తెగుళ్ల బెడద.. తగ్గుతున్న దిగుబడి

- ఆందోళన చెందుతున్న రైతులు
- పెన్‌పహాడ్ మండలంలో 175 ఎకరాల్లో సాగు


సింగారెడ్డిపాలెంలో సాగు చేసిన కంది పంట

పెన్‌పహాడ్ : ఖరీఫ్‌లో కంది పంటలు సాగు చేసిన రైతులు సరైన దిగుబడి లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సీజన్ ప్రారంభంలో ఆలస్యంగా వర్షాలు కురవడంతో రైతులు కంది విత్తనాలను ఆలస్యంగా విత్తుకున్నారు. కానీ రెండు నెలలుగా వానలు లేక మొక్కల్లో ఎదుగుదల లోపించింది.

175 ఎకరాల్లో సాగు..

రైతులు ఏటా కంది పంటను అంతర పంటగానే సాగు చేస్తున్నారు. కానీ కంది పంటకు మంచి మద్దతు ధర లభిస్తుండడంతో ఈసారి పెన్‌పహాడ్ మండలంలో 175ఎకరాల్లో ప్రధాన పంటగా సాగు చేశారు. మండలంలో కంది సాగు ప్రతి ఏడాది పెరుగుతుండడంతో పప్పు దినుసుల కొరత కూడా తీరనుందని రైతులు ఆశిస్తున్న సమయంలో పంటలకు తెగుళ్లు సోకుతున్నాయి. దీంతో పంటలకు తీవ్ర నష్టం కలిగిందని రైతులు వాపోతున్నారు. మొక్కలు పాలిపోయి, ఆకులు ఎర్రగా మారి రాలిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కంది పంటలో గడ్డి విపరీతంగా పెరగడంతో కొంత మంది రైతులు గడ్డి మందు పిచికారీ చేస్తుండగా మరికొంత మంది రోజువారీగా కొంత కలుపు తీసుకుంటూ తంటాలు పడుతున్నారు. ఈ ఏడాది పత్తి, కంది పంటలు అనుకున్నంత దిగుబడి రాకపోయే అవకాశాలు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కంది పంట పూత రాలుతుండడంతో పంటను దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

అధికారుల సూచనలు పాటించాలి



పూత రాలిపోతుంటే ప్లానోఫిక్స్ పిచికారీ చేసుకోవాలి. పురుగు ఉంటే కోరాజన్ పిచికారీ చేయాలి. ప్రస్తుతం మంచు పడుతుండడంతో కంది పంటలో పూత, కాత రాలిపోతుంది. మంచు కురవకుంటే పంట దిగుబడిలో ఎలాంటి ఇబ్బంది ఉండదు. రైతులు ఆందోళన చెందవద్దు. అధికారుల సూచనలు పాటించాలి.

– బి.కృష్ణసందీప్, మండల వ్యవసాయ అధికారి

పేదల కోసం పనిచేసే నాయకుడికే ఓటేస్తాం

నూతన ఓటర్ల మనోగతం

నూతనంగా ఓటు హక్కు పొందిన యువత తమ ఓటును పేదలకు సేవ చేసే నాయకుడికే వేస్తామని అంటున్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించే వారినే ఎన్నుకుంటామని తెలుపుతున్నారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. బుధవారం వారు ఓటు హక్కును వినియోగించుకోవడంపై సాక్షికి తమ అభిప్రాయాలను తెలియజేశారు. – సాక్షి నెట్‌వర్క్

ప్రలోభాలకు లొంగొద్దు



యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఎన్నికల ప్రక్రియలో ఓటరే ప్రధానం. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా కచ్చితంగా ఓటు వేయాలి. ఓటు వేయడం బాధ్యత. మంచి నాయకుడిని ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.

– నల్లగుంట్ల సాయికీర్తన, విద్యార్థిని, అర్వపల్లి

రాజ్యాంగం కల్పించిన వరం



రాజ్యాంగం మనకు కల్పించిన గొప్ప వరం ఓటు హక్కు. ఈసారి కొత్తగా ఓటు హక్కు పొందాను. ప్రలోభాలకు తావులేకుండా ప్రజాసేవ చేసే నాయకుడికి ఓటు వేస్తాను. ఓటు వజ్రాయుధం లాంటింది. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి.

– షేక్ ఆలియాతరున్నుం, విద్యార్థిని, అర్వపల్లి

ప్రజా సమస్యలు తీర్చే వారికే ఓటు



నేను తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నా. నా తొలి ఓటును ప్రజా సమస్యలను పరిష్కరించే మంచి నాయకుడికే వేస్తా. ఎవరూ ఓటును అమ్ముకోవద్దు. మోసపూరిత హామీలు నమ్మొద్దు. నిజాయితీగా పనిచేసే నాయకుడినే ఎన్నుకోవాలి.

– సుమంత్, ఆత్మకూర్(ఎస్)

ఉద్యోగాలు కల్పించే వారికే ఓటు



నిరుద్యోగ సమస్య పరిష్కరించే వారికే ఓటు వేసి ఎన్నుకోవాలి. ప్రస్తుత జనాభాలో యువత సంఖ్య అధికంగా ఉంది. యువతే దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. కాబట్టి యువత ఆలోచించి నిజాయితీగా పనిచేసే వారిని గెలిపించాలి. రాజ్యాంగం మనకు హక్కులే కాదు.. బాధ్యతల్ని ఇచ్చింది.

– సారగండ్ల రుచిత, విద్యార్థిని, అర్వపల్లి

మంచి నాయకుడిని ఎన్నుకోవాలి



ప్రస్తుత ఎన్నికల్లో ఇష్టానుసారంగా హామీలను ఇస్తున్నారు. ఎన్నికల తర్వాత హామీలను మరిచిపోతున్నారు. హామీలను నెరవేర్చే మంచి నాయకుడిని ఎన్నుకోవాలి. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. యువత తప్పకుండా ఓటు వేయాలి.

– శివ, సూర్యాపేట

రాజ్యాంగం కల్పించిన హక్కు



దేశాన్ని ప్రగతి పథంలో నడిపించేది రాజ్యాంగ విలువలే. దేశం అభివృద్ధి సాధించాలంటే మంచి నాయకుడిని ఎన్నుకోవాలి. అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు కల్పించే వారిని ఎన్నుకోవాలి. సామాజిక దృక్పథం కలిగిన అభ్యర్థులకే పట్టం కట్టాలి. పేదలకు అండగా ఉండే నాయకునికి ఓటు వేస్తాను.

– ప్రణీత్‌రెడ్డి, ఇంజనీరింగ్ విద్యార్థి, తిరుమలగిరి

ఓటు హక్కును వినియోగించుకోవాలి



యువతకు ఉపాధి కల్పించే నాయకునికే ఓటు వేస్తాను. ప్రస్తుత జనాభాలో యువత అధికంగా ఉంది. వారికి న్యాయం చేసే వారిని ఆదరించాలి. పెద్ద చదువులు చదివి నిరుద్యోగంగా ఉన్న వారి సంఖ్య అధికంగా ఉంది. యువత తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– జియా, తిరుమలగిరి

మంచి నాయకుడికే ఓటు



సామాజిక దృక్పథం కలిగిన అభ్యర్థులకు పట్టం కట్టాలి. పేదలకు అండగా ఉండే నాయకుడికి ఓటు వేస్తాను. దేశం అభివృద్ధి సాధించాలంటే మంచి నాయకులనే ఎన్నుకోవాలి. ఓటు ఎంతో విలువైంది. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– బిజిగ వినయ్, చీదెళ్ల

యువత తప్పకుండా ఓటేయాలి



యువత తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలి. యువతకు ఉపాధి కల్పించే నాయకుడికే ఓటు వేస్తా. పెద్ద చదువులు చదివి నిరుద్యోగులుగా ఉన్న వారి సంఖ్య అధికంగా ఉంది. పేదలకు మేలు చేసే నాయకుడికే ఓటు వేస్తా.

– నల్లగంతుల యశ్వంత్, అనంతారం

కోదాడ నియోజకవర్గంలో 296 పోలింగ్ స్టేషన్లు

- పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసిన అధికారులు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 2,41,554 మంది ఓటర్లు


పోలింగ్ కేంద్రాలకు బయలుదేరిన సిబ్బంది

కోదాడ : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు కోదాడ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణ బుధవారం తెలిపారు. కోదాడ నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు కోదాడ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 296 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో పోలీస్ స్టేషన్‌కు ఒక ఈవీఎం, మూడు బ్యాలెట్ యూనిట్లు, ఒక వీవీ ప్యాట్ చొప్పున పంపిణీ చేసినట్లు చెప్పారు. వీటితో పాటు అదనంగా 74 ఈవీఎంలను అందుబాటులో ఉంచామన్నారు. ఎన్నికల సామగ్రి మొత్తాన్ని బాలాజీనగర్ వద్ద ఉన్న ఎఫ్‌సీఐ గోదాముల వద్ద నుంచి పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు మొత్తం 1186 మంది సిబ్బందిని, అదనంగా మరో 200 మందిని రిజర్వులో ఉంచినట్లు వివరించారు. నియోజకవర్గాన్ని మొత్తం 25 రూట్లుగా విభజించి ఒక్కో రూట్‌కు ఒక సెక్టార్ ఆఫీసర్ చొప్పున మొత్తం 25 మంది సెక్టార్ ఆఫీసర్‌లను నియమించినట్లు తెలిపారు. అదనంగా మరో ముగ్గురిని కూడా అందుబాటులో ఉంచామన్నారు.

2,41,554 మంది ఓటర్లు

కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా 2,41,554 మంది ఓటర్లు గురువారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1,18,039 మంది పురుషులు, 1,23,500 మంది మహిళలు, 15 మంది ట్రాన్స్‌జెండర్స్ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

పోలీస్ సిబ్బందికి ఎస్పీ దిశా నిర్దేశం

నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే బుధవారం కోదాడలో దిశా నిర్దేశం చేశారు. దాదాపు 1400 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 85 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయని, వాటి వద్ద అదనపు సిబ్బందిని నియమించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సిబ్బందికి, ఎన్నికల సామగ్రికి భద్రత కల్పించడంతో పాటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలింగ్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఉదయం 5– 30 గంటలకు మాక్ పోలింగ్ జరుగుతుందని, 7 గంటలకు రెగ్యులర్ పోలింగ్ జరుగుతుందని, సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగుస్తుందని, అక్కడి నుంచి ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలకు తరలించే వరకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

పత్తి రైతులకు కూలీల కొరత


ఫణిగిరిలో కూలీల కొరతతో ఏరకుండా చేనులోనే ఉన్న పత్తి


ఆటోలో ప్రమాదకరంగా వెళ్తున్న కూలీలు

- పెరిగిన కూలి రేట్లు
- మబ్బులతో ఆందోళనలో రైతులు

నాగారం : పత్తి రైతులకు కూలీల కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు. పత్తిపంటకు తెగుళ్లు సోకి దిగుబడి తగ్గడంతో ఆందోళన చెందుతున్న రైతులకు కూలీల కొరత మరో ఎదురుదెబ్బ అవుతోంది. వాతావరణ మార్పులతో, మబ్బులు కమ్ముకొస్తుండటంతో పంట ఎక్కడ తడిసిపోతుందోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. కూలీల కొరత ఉండటంతో రైతులు పత్తి ఏరించడం ఇబ్బందిగా మారింది. ఒక్కో కూలీకి రూ.250 చెల్లిస్తూ ఆటో కిరాయి రూ.50 కూడా రైతే భరించి మొత్తం రూ.300 ఇస్తే గాని కూలీలు వచ్చే పరిస్థితి లేదు. కూలి డబ్బులు కూడా ముందే అడ్వాన్స్‌గా చెల్లించాల్సి వస్తోంది.

ఆటోలకు భలే గిరాకీ..

పత్తి విత్తనాలు వేసే సమయం నుంచి పత్తిని తీసే వరకు కూలీలను ఆటోలలో తీసుకెళ్లి తీసుకొస్తే ఒక్కొక్కరికి రూ.50ల చొప్పున తీసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోయజమానులు ఒక్కో ఆటోలో సుమారు 15 నుంచి 20 మందిని ప్రమాదకరంగా తీసుకెళ్తున్నారు. రోజుకు రూ.750 నుంచి రూ.1000 వరకు సంపాదిస్తున్నారు.

చేనులోనే పత్తి రాలుతోంది

ఈ ఏడాది 4 ఎకరాల్లో పత్తిపంటను సాగుచేశాను. పత్తికి తెగుళ్లు సోకి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఉన్న పత్తినైనా ఏరిద్దామనుకుంటే కూలీల కొరత నెలకొంది. దీంతో చేనులోనే పత్తి రాలిపోతుంది. చుట్టు పక్కల గ్రామాల కూలీలకు రూ.250చెల్లించి, ఆటోకి రూ.50 మొత్తం రూ.300 చెల్లించి పత్తి ఏరిద్దామన్నా కూలీలు దొరికే పరిస్థితి లేదు.

– బి.జానయ్య, రైతు, ఫణిగిరి

పాదయాత్రగా వెళ్లడం అభినందనీయం

కోదాడఅర్బన్ : సమాజం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అయ్యప్పస్వామి దర్శనానికి పాదయాత్రగా వెళ్లడం అభినందనీయమని అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు అర్వపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం కోదాడ ప్రాంతానికి చెందిన చుక్కా రామారావు 32 రోజుల పాటు సుమారు 1300 కిలోమీటర్లు పాదయాత్ర చేసి అయ్యప్పస్వామిని దర్శించుకుని వారి నివాసానికి తిరిగి చేరుకున్న సందర్భంగా ఆయనను దీక్షా ప్రచార సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చుక్కా రామారావు మాట్లాడారు. స్వామి కరుణ, కటాక్షంతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజర్ జగనీ ప్రసాద్, యశ్వంత్, జితేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలవాలని హోమం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడలో పద్మావతి గెలుపొందాలని హుజూర్‌నగర్ పట్టణంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయంలో సామల సిద్ధార్థరెడ్డి, మాధవి దంపతులు బుధవారం గణపతి హోమం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు సాముల శివారెడ్డి, లక్ష్మీపార్వతి, మాధవి పాల్గొన్నారు.